సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి టిజి.భరత్. పక్కన కలెక్టర్ రంజిత్ బాష, ఎస్పీ బిందు మాధవ్

'నామినేటెడ్' ఎవరికో..?



- రేసులో పలువురు ఆశావహులు
- నేడో, రేపో మూడో జాబితా

నూతనంగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారిస్తూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లాల నుంచి ఇప్పటికే డోన్ నియోజకవర్గం నుంచి ధర్మవరం సుబ్బారెడ్డిని ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి వరించింది. కుడా ఛైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లును నియమించారు. మరికొన్ని కార్పొరేషన్ ఛైర్మన్లను ప్రకటించాల్సి ఉండటంతో ఇంకా నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కుతాయో అన్న ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో ఆశావహులు భారీగానే ఉన్నారు. వారందరూ టిడిపి అదిష్టానంపై ఆశలు పెట్టుకున్నారు. నేడో, రేపో మూడో జాబితా విడుదల కానుండటంతో తమకు ఏదో ఒక పదవి దక్కుతుందన్న ఆశాభావంతో ఉన్నారు...

పాలకుర్తి తిక్కారెడ్డి

వాహిద్ హుస్సేన్

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టిడిపి కూటమి మంచి విజయాన్నే సాధించింది. జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా 11 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి, ఒక అసెంబ్లీ స్థానంలో బిజెపి అభ్యర్థి కూటమి తరపున గెలుపొందారు. రెండు పార్లమెంట్ స్థానాల్లోనూ టిడిపి అభ్యర్థులు విజయం సాధించారు. ఎన్నికల్లో సీట్ల కేటాయింపు సమయంలో కొందరు అభ్యర్థులకు మొండి చేయి చూపి ఇతరులకు సీటును కేటాయించారు. వారికి ఏదో ఒక పదవి ఇస్తామంటూ బుజ్జగించారు. అలాంటి వారందరూ ప్రభుత్వంలో తమకు ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఇప్పటికే ఎపి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మన్నె ధర్మవరం సుబ్బారెడ్డిని నియమించారు. కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్‌గా సోమిశెట్టి వెంకటేశ్వర్లును నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండు విడతల్లో కార్పొరేషన్లకు ఛైర్మన్లను ప్రకటించగా ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి ధర్మవరం సుబ్బారెడ్డికి, సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు స్థానం దక్కింది. 2019లో టిడిపి ఓటమి పాలయిన తరువాత సుబ్బారెడ్డిని నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించారు. ఆ తరువాత ప్యాపిలి మండలం జలదుర్గంలో జరిగిన బాదుడే బాదుడు సభలో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డోన్ టిడిపి అభ్యర్థిగా సుబ్బారెడ్డిని ప్రకటించారు. తీరా ఎన్నికల సమయంలో ఆయనను కాదని డోన్ సీటును కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి ఇచ్చారు. అప్పుడు తన సీటును వదులుకున్నందుకు సుబ్బారెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు సుబ్బారెడ్డికి సీడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా అవకాశం కల్పించారు. ఇంకా కొన్ని కార్పొరేషన్లకు ఛైర్మన్ పదవులను ప్రకటించాల్సి ఉండటంతో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగానే ఉంది. టిడిపి ప్రభుత్వం నామినేటెడ్ పదవుల భర్తీపై దృష్టి సారించడంతో ఎవరికి వారు తమ తమ స్థాయిలో జోరుగా ప్రయత్నాలు సాగిస్తున్నారు. నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న వారిలో టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, ఆదోని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు, కోడుమూరు నియోకవర్గ సమన్వయకర్త విష్ణువర్ధన్ రెడ్డి, నంద్యాల నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జి భూమా బ్రహ్మానంద రెడ్డి, మైనార్టీ నాయకులు వాహిద్ హుస్సేన్ ఉన్నారు. రెండు సార్లు మంత్రాలయం నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయి 2024 ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని అనుకున్న పాలకుర్తి తిక్కారెడ్డి ఆయన సీటును త్యాగం చేయాల్సి వచ్చింది. రాఘవేంద్రరెడ్డికి టిడిపి టికెట్ ఇచ్చారు. తిక్కారెడ్డికి టిడిపి జిల్లా అధ్యక్ష పదవిని అప్పగించారు. అధికారంలోకి వస్తే సమున్నత పదవి ఇస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. దీంతో ఆయన ప్రస్తుతం నామినేటెడ్ పదవుల బరిలో ఉన్నారు. నంద్యాల టికెట్ ఆశించిన భూమా బ్రహ్మానందరెడ్డి, వాహిద్ హుస్సేన్‌లకు మొండిచేయి చూపి ఆ టికెట్‌ను ఎన్‌ఎమ్‌డి.ఫరూక్‌కు ఇచ్చారు. ఆ సమయంలో వారికి న్యాయం చేస్తామని అదిష్టానం హామీ ఇచ్చింది. ఫరూక్ గెలుపుకు కృషి చేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చేందుకు టిడిపి అదిష్టానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా పని చేసిన కోట్ల సుజాతమ్మ, మాజీ మంత్రి కెఇ ప్రభాకర్, రాష్ట్ర గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా పని చేసిన నాగేశ్వర్ యాదవ్‌తో పలువురు జనసేన, బిజెపి నేతలు కూడా నామినేటెడ్ పదవులను ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. నేడో, రేపో మూడో విడత నామిటేడెట్ పదవుల జాబితాను విడుదల చేయనుండటంతో ఎవరెవరికి పదవులు దక్కుతాయో అని ఉత్కంఠ నెలకొంది.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

- రోడ్ల మరమ్మతుల పనులు పూర్తి కావాలి
- ఆయా శాఖల అధికారులతో టిజి.భరత్ సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రానున్న వేసవి కాలంలో జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ మంత్రి టిజి.భరత్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతుల పనులు కూడా త్వరగా పూర్తి కావాలన్నారు. గురువారం కర్నూలులోని ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషతో కలిసి ఆయా శాఖల అభివృద్ధి కార్యక్రమాల మంత్రి టిజి.భరత్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టు లకు సంబంధించి ప్రాధాన్యత పరంగా ఏమి చేస్తే జిల్లాకు బాగుంటుందనే వివరాలను ఇవ్వాలని, వాటిని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పల్లె పండుగ కింద ఇంకా పెండింగ్ లో ఉన్న సిసి రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్ ఎస్ఇని ఆదేశించారు. ఆర్అండ్‌బి ద్వారా రోడ్ల నిర్మాణానికి సంబంధించి గుంతలను పూడ్చే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇతర శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులను కూడా నిర్దేశించిన గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పుచ్చకాయలమాడ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు సంబంధించి పెండింగులో ఉన్న పనుల వివరాలను ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి అధికారులతో మాట్లాడి వాటిని త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటానన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణ పనులకు సంబంధించి పల్లెపండుగ కింద శాంక్షన్ చేసిన 830 పనులకు గాను 758 పనులను పూర్తి చేసి రాష్ట్రంలో 91 శాతంతో మొదటి స్థానంలో ఉన్నామని మంత్రి కి వివరించారు. ఆర్అండ్‌బికి సంబంధించి 1074 కిలోమీటర్లకుగాను 884 కిలోమీటర్ల వరకు ప్యాచ్‌వర్క్ పనులను పూర్తి చేసి 83 శాతం వరకు పనులను పూర్తి అయ్యాయన్నారు. మున్సిపాలిటీ పరిధిలో కూడా రోడ్ల మీదగుంతలు పూడ్చే పనులు జరుగుతున్నాయన్నారు. జనవరి చివరి నాటికి పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా ఎస్‌పి జి.బిందు మాధవ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఒ వెంకటనారాయణమ్మ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఇ మహేశ్వరరెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ఇ రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి రోడ్డు ప్రయాణం చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్లో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు-2025కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా వాహనదారులు, ప్రజలు, విద్యార్థులను భాగస్వామ్యం చేసి రహదారి భద్రతలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సంపూర్ణ అవగాహన కల్పించాలన్నారు. వాహనదారులు మద్యం సేవించి వాహనం నడపకూడదని, మోటార్ సైకిల్ నడుపుతున్నప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, రాష్ డ్రైవింగ్, అధిక వేగం ప్రమాదకరమన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమని అవగాహన కల్పించాలన్నారు. కారులో ప్రయాణిస్తున్నప్పుడు సీట్‌బెల్ట్‌ను ధరించ డం దాని ప్రాముఖ్యత గురించి వివరించాలన్నారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్‌పి (అడ్మిన్) హుస్సేన్ పీరా, ఉపరవాణా కమిషనర్ శాంతకుమారి, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు : గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాష ఆదేశించారు. కలెక్టరేట్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జాతీయ పతాకావిష్కరణ, బారికేడింగ్, వైట్ వాష్‌వంటి ఏర్పాట్లతో పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ను వేడుకలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు, ప్రజా ప్రతినిధులకు ఆహ్వానాలు పంపాలని, సీటింగ్ ఏర్పాట్లను చేయాలని కర్నూలు ఆర్‌డిఒను ఆదేశించారు. అన్ని శాఖల నుండి ప్రభుత్వ పథకాల వివరాలను క్రోడీకరించి సందేశాన్ని రూపొందించాలని, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఇబ్బంది లేకుండా చూడాలని, కలెక్టర్ సమాచార శాఖ అధికారిని ఆదేశించారు. అదేవిధంగా పరేడ్ గ్రౌండ్స్‌లో తాగు నీటి ఏర్పాట్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించారు. ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, అదనపు ఎస్‌పి (అడ్మిన్) హుస్సేన్‌పీరా, డిఆర్ఒ వెంకట నారాయణమ్మ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మొబైల్ టవర్ల అభివృద్ధికి కృషి

- ఎంపీలు బైరెడ్డి శబరి, నాగరాజు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

మొబైల్ టవర్ల అభివృద్ధికి కృషి చేస్తామనికర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ,నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బిఎస్ఎన్ఎల్ కర్నూల్ బిజినెస్ ఏరియా టెలికాం అడ్వైజరీ కమిటీ 2024-26 రెండు సంవత్సరాల కాలానికి మొదటి సమావేశం కర్నూలు బిఎస్ఎన్ఎల్ భవన్‌లో గురువారం నిర్వహించారు. నంద్యాల పార్లమెంటులో టెలికాం సేవలను అభివృద్ధి చేస్తామని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. కేంద్ర ప్రభుత్వం టెలికాం రంగానికి ఎంతగానో సపోర్టు చేస్తున్నదని, అత్యధిక బడ్జెట్‌ను బిఎస్ఎన్ఎల్ అభివృద్ధికి కేటాయించిందని తెలిపారు. నంద్యాల నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలకు మొబైల్ సిగ్నల్ అందే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా రోళ్ళపాడు లాంటి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పర్యాటక ప్రాంతాలకు త్వరలో మొబైల్ టవర్లను ఏర్పాటు చేయించడానికి కృషి చేస్తానని తెలిపారు . బిఎస్ఎన్ఎల్ అధికారుల దృష్టికి టెలికాం అడ్వైజరీ కమిటీ మెంబర్లు ఏ ఊర్లో టవర్లు లేవు, ఎక్కడ సిగ్నల్ తక్కువగా ఉందన్న విషయాలు సమగ్రంగా ప్రజలను కలిసి ఒక నివేదిక తయారు చేసి ఇవ్వాలని ఎంపీ సూచించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ టిఏసి సభ్యులు కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్‌కు, ప్రజలకు మధ్యవర్తిత్వం వహించి టెలికాం సేవలు అభివృద్ధి చేయడానికి కీలకపాత్ర వహించడానికి మంచి అవకాశం లభించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నరేంద్ర మోడీ అన్ని రంగాలలో అభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్నారని, ముఖ్యంగా టెలికాం రంగంలో అభివృద్ధి సాధించడానికి చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ తక్కువ ఖర్చుతో టెలికాం సేవలను అందిస్తున్నదని, మారుమూల గ్రామాలకు టెలికాం సేవలను విస్తరిస్తున్నదని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ అధికారులకు తమ వంతు సహకారం అందిస్తామని, అధికారులు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసి పనులు జరిగే విధంగా చేస్తామని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ జి.రమేష్ బిఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా పరిధిలో అందిస్తున్న టెలికాం సేవలను వివరిస్తూ, టిఏసి సమావేశానికి ఇద్దరు ఎంపీలు హాజరైనందుకు చాలా సంతోషంగా ఉందని , బిఎస్ఎన్ఎల్ సమస్యలను ఇద్దరు ఎంపీలు దృష్టికి తీసుకువచ్చి , ఎంపీల సహకారంతో ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తామని తెలిపారు. ప్రజలకు చేరువగా అతి తక్కువ ఖర్చుతో సామాజిక సేవ చేస్తున్న బిఎస్ఎన్ఎల్ సంస్థను అందరూ ఆదరించాలని కోరారు. టిఏసి సభ్యులు తమ ప్రాంతాలలోని సమస్యలను సమావేశంలో చర్చించారు. డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రాజేశ్వర రావు, ఐఎఫ్ఎడి శ్రీలత , ఎజిఎం ఆపరేషన్ పి.శ్రీనివాసరావు, ఎజిఎం అడ్మిన్ వి.శ్రీను నాయక్, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, వేదికపై ఎంపీ నాగరాజు , అధికారులు

ఇంపీడెన్స్ ఆడియోమెట్రిమిషన్ హాస్పిటల్ విరాళంగా ఇస్తున్న డాక్టర్ లక్ష్మీ ప్రసాద్

జిజిహెచ్ కు ఇంపీడెన్స్ ఆడియో మెట్రి మిషన్ విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల (వినికిడి పరీక్ష యంత్రం) ఇంపీడెన్స్ ఆడియోమెట్రి మిషన్‌ను డాక్టర్ లక్ష్మీప్రసాద్ విరాళంగా అందజేశారు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు కర్నూలు అమీలియో హాస్పిటల్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రూ.3.85 లక్షల విలువ గల వినికిడి పరీక్ష యంత్రం) ఇంపీడెన్స్ ఆడియోమెట్రీ మిషన్ ఆసుపత్రికి విరాళంగా అందజేశారని తెలిపారు. ఇంపీడెన్స్ ఆడియోమెట్రీ యంత్రం అనేది నొప్పిలేని, నాన్‌వాసివ్ వినికిడి పరీక్షచేసే యంత్రం ఇది వివిధశబ్దాలను వినగల వ్యక్తి సామర్థ్యాన్ని కొలుస్తుందని అన్నారు. రోగులకు వినికిడి లోపం సంభవించిందో లేదో తెలుసుకోవడానికి శస్త్ర చికిత్సకు ముందు , తర్వాత వారి వినికిడిని పర్యవేక్షించడానికి ఆడియోమెట్రీ పరీక్ష చేస్తారని అన్నారు. ఆసుపత్రికి వచ్చే సదరం పేషంట్స్ వారికి కూడా ఉపయోగిస్తామని అన్నారు. ఆడియోమెట్రీ పరీక్ష మిషన్ ఇవ్వడానికి ముందు కొచ్చిన డాక్టర్ లక్ష్మీ ప్రసాద్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రిలో ఇఎన్‌టి విభాగాలకు వీటిని అందిస్థామని తెలిపారు. డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సీతారామయ్య, సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ వెంకటేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ పి.సింధు సుబ్రహ్మణ్యం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ డాక్టర్ కిరణ్ కుమార్, ఇఎన్‌టి హెచ్ఒడి, డాక్టర్ వీరకుమార్, అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ హరికిరణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మమత, అమీలియో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ప్రజాశక్తి-పత్తికొండ : దుకాణ ,గృహ యాజమాన్యాలు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పత్తికొండ అర్బన్ సిఐ జయన్న పేర్కొన్నారు. గురువారం పత్తికొండ పోలీస్ స్టేషన్‌లో ప్రజాశక్తితో అర్బన్ సిఐ జయన్న మాట్లాడుతూ పత్తికొండ ప్రజలు మెయిన్ రోడ్డు, అయ్యప్ప కాంప్లెక్స్, మార్కెట్ యార్డ్, తేరు బజార్ రద్దీ ప్రదేశాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, దొంగలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. సిసి కెమెరాలుంఏర్పాటు చేసుకోవడం వల్ల దొంగలను పట్టుకోవడానికి సులువుగా ఉంటుందని అన్నారు. పోలీసులకు సహకరించాలని కోరారు.

పోలకల్‌లో శనగ పంట కోతప్రయోగం

ప్రజాశక్తి- సి బెళగల్

మండలంలోనీ పోలకల్‌లో పచర్ల తిరుమలేష్‌శనగ పొలంలో గురువారం ఎఒ మల్లేష్ కుమార్ పంట కోత ప్రయోగం చేశారు. ఇందులో 25 అడుగుల కొలతలకు గాను రెండు కేజీల 810 గ్రాములు దిగుబడి వచ్చిందని నిర్ధారించారు. ఎకరాకు సుమారు 4.5 క్వింటాళ్లలో దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా కింద ఈ పంటలు ఎంపికయ్యాయని బీమా ఏజెంట్లు తెలిపారు. సిబ్బంది వెంకటేశ్వర్లు,అఫ్రిన్,ఊర్మిళ,రైతులు పాల్గొన్నారు.

తాగునీటికి తప్పని తంటాలు

ఓవర్ హెడ్ ట్యాంక్ నిరుపయోగం

రూ.50లక్షలు ఖర్చుచేసినా ఫలితం సూన్యం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

స్టాంటన్‌పురం గ్రామానికి చెందిన బాలాజీనగర్‌లో 2008సంవత్సరంలో పంచాయతీరాజ్ శాఖ వారు రూ.50 లక్షలు ఖర్చు చేసి ఓవర్ హెడ్ ట్యాంకును నిర్మించారు. అధికారుల నిర్లక్ష్యం వలన తాగునీటి సమస్య తీరలేదు. ఆ ట్యాంకు చుట్టూ సుమారు 10 సెంట్లు స్థలం కూడా కాలనీవాసులు పార్క్ కోసం వదిలి పెట్టారు. ఆ స్థలం చుట్టూ ప్రహరీగోడ నిర్మించి వదిలిపెట్టారు. అక్కడ పార్కు అభివృద్ధి చేయలేదు. ఓవర్ ట్యాంకుకు పైపులు కనెక్షన్ ఇచ్చి నీళ్లు ఎక్కించలేదు. ఆ తరువాత మామిదాలపాడు, మునగాలపాడులతోపాటు స్టాంటన్‌పురం కూడా నగరపాలక సంస్థలో విలీనం చేశారు. నాటినుండి నగరపాలక సంస్థ అటువైపు కన్నెత్తి కూడా చూడలేదు. బాలాజీనగర్ అభివృద్ధి కమిటీ నాయకులు అనేక పర్యాయాలు నగరపాలక సంస్థ కమిషనర్‌కు వినతులు అందజేసినా ఏ మాత్రం పట్టించుకోలేదు. కేవలం పార్కులో పిల్లలు ఆడుకునేందుకు రెండు ఆట వస్తువులు మాత్రమే ఏర్పాటు చేసి వదిలేశారు. ఆ వార్డు నుండి ఎన్నికైన కార్పొరేటర్ సైతం ఆ ట్యాంకు గురించి, పార్కు గురించి పట్టించుకోకపోవడంతో ఎక్కడి సమస్య అక్కడే ఉంది. ఇటీవల పిల్లలు ఆడుకునేందుకు పార్కు స్థలంలో ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి షటిల్ ఆడుకోవడానికి చదును చేసి పెట్టుకున్నారు. వెంటనే నగరపాలక సంస్థ కమిషనర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి పైప్‌లైన్ ద్వారా ట్యాంక్ కునీళ్లు ఎక్కించి బాలాజీ నగర్ వాసులకు రెండు రోజులకు ఒకసారి వచ్చే నీటి సరఫరా కాకుండా రోజు నీరు వదిలే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

50 లక్షలతో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు

ఎస్ మాణిక్య రెడ్డి బాలాజీ నగర్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షులు

గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న సందర్భంలో ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ వారు ఈ ప్రాంత ప్రజల దాహార్తి తీర్చేందుకు రూ.50 లక్షల ఖర్చు చేసి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. నాటి నుండి నేటి వరకు ట్యాంకుకు పైప్‌లైన్ కనెక్షన్ ఇచ్చి నీరు ఎక్కించిన దాఖలాలు లేవు. ఇంతవరకు కుళాయిలకు నీరు పారలేదు.

ప్రజాధనం వధా

రవికుమార్,బాలాజీ నగర్ డెవలప్మెంట్ సొసైటీ కార్యదర్శి

బాలాజీనగర్‌లోని ప్రజల సౌకర్యార్థం నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసినప్పటి నుంచి దిష్టిబొమ్మలా నిలిచి ఉంది. ట్యాంక్ నిర్మాణం చేసి 17 యేళ్లు అయింది ఇలాగే వదిలేస్తే కొంతకాలానికి శిథిలావస్థకు చేరుతుంది.

వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలి

లతీఫ్‌బాషబాలాజీనగర్ డెవలప్మెంట్ సొసైటీ సహాయ కార్యదర్శి

పార్కు స్థలంలో పిల్లల కోసం వ్యాయామ పరికరాలు ఏర్పాటు చేయాలి. వయోవృద్ధులకు కూర్చునే బల్లలు ఏర్పాటు చేసి మొక్కలు పెంచి పచ్చదనాన్ని పంచాలి.

మాట్లాడుతున్న అదనపు కమిషనర్ కృష్ణ, వేదికపై కమిషనర్ రవీంద్రబాబు

పౌర గుర్తింపు సర్వే వేగవంతం

నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర వ్యాప్తంగా పౌర గుర్తింపు సర్వే వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం నగరపాలక సమావేశ భవనంలో సచివాలయ కార్యదర్శులతో సర్వే పురోగతిపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికి 80,553 మంది పౌరులు ప్రభుత్వ రికార్డుల్లో లేరని, వారిని వెంటనే గుర్తించి ఆయా సచివాలయ పరిధిలో ఉన్నట్లు నిర్ధారించాలని ఆదేశించారు. ఈ నెలాఖరులోగా సర్వే పూర్తి చేయాలని, జాప్యం చేయకుండా సిబ్బంది పకడ్బందీగా సర్వే నిర్వహించాలని కమిషనర్ ఆదేశించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, అధికారులు సాదిక్, ఎం.కుమార్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో తెల్లవారుజాము నుంచే విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులు, తగు స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. గురువారం ధర్మపేట, గాంధీనగర్, ఛత్రీబాగ్, బొంగులబజార్, తదితర ప్రాంతాల్లో కమిషనర్ పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోగాల బారిన పడకుండా కార్మికులు రక్షణ దుస్తులు, చేతులకు గ్లౌస్‌లు, కాళ్ళకు బూట్లు వంటివి ధరించాలని సూచించారు. ప్రజారోగ్యంతో పాటు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని అన్నారు. తమకు కేటాయించిన కాలనీల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని, ప్రజల నుండి ఫిర్యాదులు వచ్చేంత వరకు ఉండొద్దని ఆదేశించారు.

పాలస్తీనా ప్రజలకు అండగా ఉందాం : వక్తల పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

పాలస్తీనా ఇజ్రాయిల్ యుద్ధాన్ని రెండు దేశాల మధ్య యుద్ధంగా చూడకూడదని ప్రపంచంలో జరుగుతున్న సామ్రాజ్యవాదానికి ప్రతిబింబంగా చూడాలని, ఈ నేపథ్యంలో పాలస్తీనా ప్రజలపై జరుగుతున్న దారుణ మారణకాండకు వ్యతిరేకంగా మేధావులు కవులు కళాకారులు గళం విప్పాలని పాలస్తీనా ప్రజలకు అండగా నిలబడాలని వక్తలు పిలుపునిచ్చారు. గురువారం కర్నూలు బావర్చి ఫంక్షన్ హాలులో కవిచౌశా రచించిన 'బిసాన్ ఓవ్‌డా' పుస్తకాన్ని ప్రముఖ ఆర్థిక నిపుణులు డాక్టర్ మన్సూర్ రెహ్మాన్ ఆవిష్కరించారు. నంది అవార్డు గ్రహీత మహమ్మద్ మియా సభాధ్యక్షతన నిర్వహించిన సభలో పుస్తకాన్ని కథారచయిత ఇనాయతుల్లా సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఒక చిన్న దేశంపై సామ్రాజ్యవాద దేశాలన్నీ కలిసి యుద్ధం చేస్తూ పసి పిల్లల్ని, మహిళల్ని చంపుతూ ఆ దేశాన్ని నెత్తుటి మయం చేశాయని, దీన్ని చౌశా గొప్ప కవిత్వంగా రాశాడని అన్నారు. బిసాన్ ఓవ్‌డా పాలస్తీనాలో జర్నలిస్ట్‌గా పని చేస్తూ యుద్ధాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా అందిస్తున్నారని , ఆమె అందించడం మూలంగా ఆ దేశంలో జరుగుతున్న స్థితిగతులన్నీ మనకు తెలుస్తున్నాయని అన్నారు. ఆ నేలను నెత్తుటితో తడుపుతున్నారనే విషయాలన్నీ ఈ పుస్తకంలో ఉన్నాయన్నారు. మన్సూర్‌రెహ్మాన్ మాట్లాడుతూ ఈ ప్రపంచాన్ని గుప్పెట్లో పెట్టుకోవాలన్న సామ్రాజ్యవాదకాంక్ష చాలా ప్రమాదమని అన్నారు. దీనికి వ్యతిరేకంగా సామ్యవాదాన్ని కోరుకుంటూ కవి చౌశా రచనలు సాగిస్తున్నారని అన్నారు. పిపిఎస్ఎస్ నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మనదేశంలో కూడా మతోన్మాదులు పేట్రేగిపోతున్నారని పాలస్తీనాను ధ్వంసం చేసినట్లే మన దేశాన్ని ధ్వంసం చేసే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. లౌకిక సమాజాన్ని అందరం కలిసి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రముఖ కవి వెంకటకృష్ణ మాట్లాడుతూ కవిచౌశా ఇప్పటివరకు తను రాసిన రచనలన్నీ వర్తమాన ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలే వస్తువులుగా రాశాడని అన్నారు. ఆవాజ్ నాయకులు ఇక్బాల్ మాట్లాడుతూ ఈ దేశాన్ని అందరం కలిసి కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సభను కవి కెంగార మోహన్ ప్రారంభోన్యాసం చేశారు. కవులు కళ్యాణదుర్గం స్వర్ణలత, సయ్యద్ జహీర్ అహ్మద్, రామాంజనేయులు, విజయులు తనగల, గౌరెడ్డి హరిచంద్రారెడ్డి, ఆద్య మెడికల్స్ అధినేత ఎవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మన్సూర్‌రెహ్మాన్, ఇక్బాల్‌హుస్సేన్,మహ్మద్‌మియా, పుల్లారెడ్డి, వెంకటకృష్ణ



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

క్రీడలతో మానసికోల్లాసం : ఎమ్మెల్యే బీవీ

- రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. గురువారం ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, క్రీడాకారులను పరిచయం చేసుకొని, కబడ్డీ ఆడుతూ పోటీలను ప్రారంభించారు. కబడ్డీ ఆర్గనైజర్లు, టిడిపి నాయకులు బందేనవాజ్, కౌన్సిలర్లు ఇసాక్, అమానుల్లా, ఫరూక్ పాల్గొన్నారు.

ఎద్దులతో ముడిపడిన వ్యవసాయ రంగం

వ్యవసాయ రంగం ఎద్దులతో ముడిపడి ఉందని, వ్యవసాయానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బల ప్రదర్శన పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతర సందర్భంగా రైతులు సంబరాలు జరుపుకోవాలని ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి పోటీలకు పెద్దఎత్తున ఎడ్ల జతలు రావడం సంతోషంగా ఉందన్నారు. ఎమ్మిగనూరు జాతర అంటే అంతర్ రాష్ట్ర క్రీడాకారులే కాక రైతులకు ఎంతో ఆనందాన్ని నింపుతూ జాతర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్ష సజావుగా సాగాలి : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ పద్మావతి

పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లు, అభ్యర్థులు పరీక్ష రాయటానికి కావాల్సిన ఏర్పాట్లను, పరీక్షా సజావుగా జరిగేటట్లు చూడాలని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఇ.పద్మావతి తెలిపారు. గురువారం పరీక్ష నిర్వహణపై, పరీక్ష కేంద్రం సూపరింటెండెంట్/సెంటర్ లెవెల్ అబ్జర్వర్స్‌కు కర్నూలు నగరంలోని మోంటిస్సోరి స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. 22 కేంద్రాల నుంచి (కర్నూలు-13, నంద్యాల-9) సెంటర్ సూపరింటెండెంట్/సెంటర్ లెవెల్ అబ్జర్వర్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి, జవహర్ నవోదయ విద్యాలయ ఎంపిక పరీక్ష కోసం ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 22 పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మొత్తం 6,035 మంది అభ్యర్థులు ప్రవేశ పరీక్షకు రిజిస్టర్ చేసుకున్నారని చెప్పారు. ఈ సందర్భంగా సిబెళగల్ ఎంఇఒ-2 కె.ఆదామ్ బాషా మాట్లాడుతూ... పరీక్ష సజావుగా జరిగేటట్లు అందరూ పనిచేసి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు.

పింఛన్ల తనిఖీకి సహకరించాలి : ఎంపిడిఒ

ప్రజాశక్తి - చిప్పగిరి

పింఛను పొందుతున్న ఇంటి దగ్గర ప్రత్యేక టీం పరిశీలన

మండలంలో సామాజిక, వికలాంగుల పింఛన్లు పొందుతున్న వారి పూర్తి వివరాలు తెలుసుకునేందుకు ప్రభుత్వం నియమించిన ప్రత్యేక టీము మండలంలో పర్యటిస్తుందని, వారికి సహకరించాలని ఎంపిడిఒ అల్లా బకాష్ కోరారు. గురువారం చిప్పగిరిలో ఎంపిడిఒ అల్లా బకాష్ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో పింఛన్లపై వెరిఫికేషన్‌కు వచ్చిన ప్రత్యేక టీం సభ్యులు వెంకటరమణ ఆర్తో, ప్రభుత్వ డాక్టర్ అఫ్రోజ్ జహాన్ వికలాంగుల పింఛను పొందుతున్న మహిళ ఇంటి దగ్గరకు వెళ్లి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమకు తెలిపిన వివరాలను ఉన్నతాధికారులకు వివరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఆపై ఏ నిర్ణయమయినా తీసుకోవచ్చని చెప్పారు. అస్పిరేషనల్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

'సంతాన సాఫల్యంపై నేడు ఉచిత వైద్య శిబిరం'

ప్రజాశక్తి - ఆదోని

సంతానం లేని దంపతుల కోసం సంతాన సాఫల్యంపై శుక్రవారం ఉచిత వైద్య పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలని సాష నర్సింగ్ హోమ్ గైనిక్ డాక్టర్ రేష్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడారు. పట్టణంలోని సాయి డిగ్రీ కళాశాల పక్కన సాష నర్సింగ్ హోమ్‌లో ఉచిత పరీక్ష శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంతానం కలగని వారికి ఆశలు చిగురించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. ఆధునిక యంత్రాలతో భార్యభర్తలకు పరీక్షలు చేయిస్తామన్నారు. సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కంది ధర పతనం

- గత డిసెంబర్‌లో రూ.10 వేలు.. ఇప్పుడు రూ.6 వేలు - కంది రైతుల ఆందోళన

- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి - చిప్పగిరి

కంది ధర పతనమైంది. గత డిసెంబర్ నెలలో క్వింటా ధర రూ.10 వేలు ఉండేది. ప్రస్తుతం రూ.6 వేలకు పడిపోయింది. పెట్టుబడులు ఎక్కువయి పెట్టుబడులు కూడా రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మద్దతు ధరకు కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. ప్రయివేట్ వ్యాపారులకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు.

వ్యవసాయ రంగంలో రైతుకు ప్రతేడాది ఏదో ఒక రకంగా నష్టాలే మిగులుతున్నాయి. పంట దిగుబడి ఎక్కువ వచ్చినప్పుడు ధరలు ఉండవు.. ధరలుంటే పంటలు సరిగా పండవు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొన్న రైతుకు మళ్లీ కన్నీళ్లే మిగులుతున్నాయి. ఒకప్పుడు రైతే రాజు అనేవారు. కానీ రాను రాను రైతు పెట్టిన పెట్టుబడులు చేతికి రాక ఆత్మహత్యలే శరణ్యమని, ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి దాపురించింది.

చిప్పగిరి మండలంలోని నంచర్ల, దౌల్తాపురం, రామదుర్గం, నగరడోనా, నేమకల్లు, బెల్డోన, కుందనగుర్తి, చిప్పగిరి గ్రామాల్లో వ్యవసాయ అధికారుల సమాచారం మేరకు 10,340 ఎకరాల్లో కంది పంట సాగు చేశారు. కంది పంట సాగుకు ఎకరాకు దాదాపు రూ.30 వేల దాకా పెట్టుబడి ఖర్చు అవుతుందని రైతులు తెలుపుతున్నారు. ఈ ఏడాది ఎకరాకు 4 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని

కళ్లంలో నిల్వ చేసిన కంది

రైతులు పేర్కొంటున్నారు. రైతులందరూ పంటలను కళ్లం నూర్పిడి చేసే సమయంలో బహిరంగ మార్కెట్లలో కంది ధర సగానికి పడిపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. గత డిసెంబర్ నెలలో క్వింటా కంది ధర రూ.10 వేలు, రూ.9 వేలు పలికింది. కంది పంట రైతుల చేతికి వచ్చే సమయానికి రూ.6 వేలకు పడిపోవడంతో రైతులకు కూడా దిక్కుతోచడం లేదు. ఎకరాకు దాదాపు 30 వేల దాకా పెట్టుబడి పెట్టామని, క్వింటా రూ.6 వేలకు అమ్మితే పెట్టిన పెట్టుబడి కూడా రాదని ఆవేదన చెందుతున్నారు. లోకల్ వ్యాపారులు ఒక క్వింటాకు 5 కిలోల వరకు తరుగు తీసుకుంటుండడంతో ఇక నష్టాలే మిగులుతాయని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం మద్దతు ధరతో కందిని క్వింటా రూ.7,500 ప్రకారం కొనుగోలు చేస్తామని చెప్పినా ఆ దిశగా ఏర్పాటు చేయలేదు. ఆలస్యం అవుతుండడంతో రైతులు లోకల్ వ్యాపారులకు అమ్ముకోవాల్సి వస్తోందని ఆందోళన చెందుతున్నారు. మరికొందరు కందులను కళ్లాల్లోనూ, ఇంట్లోనూ నిల్వ చేసుకుంటున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- రైతు మస్తాన్, నేమకల్లు గ్రామం

రెండెకరాల్లో కంది పంటను సాగు చేశాం. గత డిసెంబర్ నెలలో బహిరంగ మార్కెట్లలో రూ.10 వేల దాకా ధర పలికింది. కానీ ఇప్పుడు రూ.6 వేలకు, రూ.7 వేలకు తగ్గించారు. ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ఎంపిపిపై పోలీసుల అనుచిత ప్రవర్తన తగదు

- వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎంపిపిపై కొంతమంది పోలీసులు అనుచిత ప్రవర్తన తగదని మాజీ ఎంపీ, వైసిపి ఇన్‌ఛార్జీ బుట్టా రేణుక పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. శ్రీనీలకంఠ స్వామి జాతర సందర్భంగా ఎంపిపిపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించడం తగదని తెలిపారు. ప్రజాప్రతినిధుల గౌరవానికి భంగం కలిగే ఈ తరహా సంఘటనలు పునరావృతం కాకుండా, సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - నందవరం

నందవరం మండలం పూలచింత గ్రామంలో జైభీమ్ ఎంఆర్‌పిఎస్ మండల ప్రధాన కార్యదర్శి పరంపొగు సురేష్ ఆధ్వర్యంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గురువారం జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య, మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు, పూలచింత సర్పంచి బండే గురుస్వామి విగ్రహావిష్కరణ చేపట్టారు. ఈ సందర్భంగా జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ మాట్లాడారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లేకుంటే భారతదేశమంతా చీకటిగా ఉండేదని, దేశంలో వెలుగు కోసం కుటుంబాన్ని త్యాగం చేసుకున్నారని కొనియాడారు. అంబేద్కర్ చలువతో ఎంతోమంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీలు దేశంలో సమాన హక్కులు పొందే అధికారం లభించిందని తెలిపారు. రాష్ట్ర సలహాదారులు అంజి, జిల్లా అధ్యక్షులు ముత్తు, సుమాల మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమన్న, జిల్లా కన్వీనర్ గంధాలం మణికుమార్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, జై భీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యదర్శి రత్నం, జిల్లా అధికార ప్రతినిధి సత్యన్న, నియోజకవర్గ గౌరవాధ్యక్షులు అబ్రహాం, నియోజకవర్గ అధ్యక్షులు శవాల బుజ్జి బాబు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సత్యానందం, ఎంఎస్ఎఫ్ ఆదోని డివిజన్ అధ్యక్షులు ఎర్రన్న, నందవరం మండల అధ్యక్షులు చింపిరి చిన్న పోతప్ప, నందవరం ఇన్‌ఛార్జీ శవాల శాంతి రాజు, మండల ప్రధాన కార్యదర్శి పరంపోగు సురేష్, మండల నాయకులు భాస్కర్, పూలచింత గ్రామ అధ్యక్షులు భాస్కర్ ఇర్మియ, యువరాజ్, చంటి, దావీదు, ప్రదీప్, నరసింహులు, పెద్దిరన్న, నాగన్న, శాంతిరాజు పాల్గొన్నారు.

విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

'రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేయాలి'

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని బసలదొడ్డి గ్రామంలో రేషన్ దుకాణం నెంబర్-13 డీలర్‌ను సస్పెండ్ చేయాలని గ్రామస్తులు కోరారు. గురువారం తహశీల్దార్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హనుమన్న, అయ్యప్ప, రామాంజనేయులు మాట్లాడారు. ఇటీవల రేషన్ దుకాణాన్ని సివిల్ సప్లయి డిప్యూటీ తహశీల్దార్ మహేష్, ఆర్ఐ జెర్మియా ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ పాయింట్‌లో వ్యత్యాసాలపై డీలర్‌పై 6ఎ కింద కేసు నమోదు చేశారని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకుని తహశీల్దార్ తక్షణమే రేషన్ డీలర్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలోని రేషన్ కార్డులకు వచ్చే జొన్నలను సైతం సక్రమంగా పంపిణీ చేయకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం రేషన్ దుకాణానికి కేటాయించిన అలాట్‌మెంట్‌లో వచ్చిన వ్యత్యాసంపై నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీలర్‌పై చర్యలు ఉంటాయని తహశీల్దార్ శ్రీనాథ్ తెలిపారు. అంతవరకు గ్రామంలో విఆర్ఒ, విఆర్ఎ ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ జరుగుతుందని వెల్లడించారు.

వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కిడ్నీ బాధితునికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వికి చెందిన ఎరుకుల నాగరాజు కిడ్నీతో బాధపడుతున్నారని తెలుసుకున్న వైసిపి బాపురం యూత్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం రూ.20 వేలను నాగరాజు తల్లిదండ్రులకు అందజేశారు. గోవర్ధన్, అంజి, కన్నా, రామరాజు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

మౌలిక సదుపాయాలు కరువు

• డ్రెయినేజీలు, రోడ్లు లేక ఇబ్బందులు • సరిపోని నీటి సరఫరా • జగనన్న కాలనీవాసుల అవస్థలు

ప్రజాశక్తి - నందవరం

నందవరంలోని జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. రోడ్లు, డ్రెయినేజీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లు గుంతలు పడి నీరు నిలిచి ఉంటోంది. ఆ మురుగునీటిలో దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. రెండు కుళాయిలతో నీటిని సరఫరా చేస్తుండడంతో సరిపోక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారు.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో పేదలకు నిర్మించి ఇచ్చిన జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలకు నోచుకోక ప్రజలు అవస్థలు పడుతున్నారు. జగనన్న కాలనీలో ఇళ్లను నిర్మించి ఇచ్చారు.. కానీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు, తాగునీటి వసతులను సమకూర్చడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి.

నందవరం గ్రామంలో పేదల సొంతింటి కలను సాకారం చేయాలన్న దృక్పథంలో వైసిపి ప్రభుత్వం కోట వీధిలో ఇళ్లను నిర్మించింది. పేదలకు ఇచ్చింది. కాలనీలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. వీధిలో తిరగాలంటే రోడ్లు లేవు. కనీసం గ్రావెల్ రోడ్డు కూడా వేయడం లేదు. గుంతలు పడి కనీసం ప్రజలు తిరగడానికి కూడా వీలు పడడం లేదు. డ్రెయినేజీలు లేకపోవడంతో నీరు ఇళ్ల ముందే నిలిచి ఉంటోంది. ఆ మురుగు నీటి వలన వీధిలో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధి చెంది వీధి ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. వీధిలో రెండు తాగునీటి కుళాయిలు మాత్రమే ఉన్నాయి. వీధి మొత్తానికి తాగునీరు సరిపోవడం లేదు. మురుగునీరు నిలబడి, గుంతల రోడ్డులో నడిచి వెళ్లి నీరు తెచ్చుకోవడానికి ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వీధి దీపాల్లేక చీకట్లో ఉన్న జగనన్న కాలనీ

వీధి దీపాల్లేక ఇబ్బందులు పడుతున్నాం

- వీరేష్, నందవరం గ్రామం

వీధి దీపాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం వీధిలో చాలా వరకు స్తంభాలను పాతించి ఇళ్లకు విద్యుత్ సరఫరాను అందించింది. ఆ స్తంభాలపైన వీధిలైట్లను మాత్రం ఏర్పాటు చేయలేదు. వీధిలో కొన్ని స్తంభాలకు మాత్రమే చిన్నపాటి విద్యుత్ లైట్లు వేశారు. అవి నెలల వ్యవధిలోని పాడయిపోతున్నాయి. వీధి దీపాలు లేకపోవడంతో చిమ్మ చీకటిలో భయభ్రాంతులతో జీవిస్తున్నాం.

ఇళ్లలోకి పాములు వస్తున్నాయి

- సక్కమ్మ, నందవరం గ్రామం

మౌలిక సదుపాయాలు లేక వీధి దుర్భరంగా ఉంది. పక్కనే దట్టమైన చెట్లు, వాగు ఉండడంతో పాములు మధ్యాహ్నం వేళలోనే ఇళ్లలోకి వస్తున్నాయి. ఒకనెల వ్యవధిలోనే మా వీధిలో మూడు పాములు సంచరించాయి. పాముల బెడద ఎక్కువయిపోయింది. వీధిలైట్లు లేకపోవడంతో, పాముల భయంతో రాత్రి వేళలో బయట నిద్రించే పరిస్థితి లేదు.

నివాళులర్పిస్తున్న నాయకులు

మృతురాలికి రఘునాథ్ రెడ్డి నివాళి

- మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శ

ప్రజాశక్తి - మంత్రాలయం

మండలంలోని చెట్నిహల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు, మాజీ డీలర్ రెడ్డి బసన్న గౌడ్ భార్య ఈశ్వరమ్మకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి సోదరులు ఎన్.రఘునాథ్ రెడ్డి నివాళులర్పించారు. ఈశ్వరమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆయన గురువారం గ్రామానికి చేరుకొని ఆమె మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బసన్న గౌడ్‌తో తమ తండ్రి రామిరెడ్డికి స్నేహ సంబంధాలు కొనసాగుతుండేవని, ఆయన మరణ అనంతరం తమకు కూడా వారి కుటుంబ సభ్యులతో అనుబంధం కొనసాగుతోందని తెలిపారు. బసన్న గౌడ్ కుటుంబానికి తమ కుటుంబం, టిడిపి అండగా ఉంటుందంటూ ధైర్యం చెప్పారు. మేకల మల్లేష్, చేపల నాగేష్, డీలర్ గోపాల్, చాకలి నరసింహులు, విద్యా కమిటీ ఛైర్మన్ పరమేష్ ఉన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తే జిల్లా బహిష్కరణ : ఎక్సైజ్ సిఐ

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తే కేసులు నమోదు చేసి అవసరమైతే జిల్లా బహిష్కరణ చేయిస్తామని ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. గురువారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని, నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 9 బాక్సుల కర్ణాటక మద్యాన్ని బైక్‌పై తరలిస్తున్న బోయ నరసింహులు, బోయ కంబాలిని కౌతాళం మండలం హాల్వి గ్రామ సమీపంలో అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అలాగే తిప్పాలదొడ్డి గ్రామంలో అన్వేష అనే వ్యక్తి నుంచి నాలుగు బాక్సుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేశామని చెప్పారు. కర్ణాటక మద్యాన్ని రవాణా చేసే వారిపై నిఘా ఉంచామని తెలిపారు. ఇప్పటికే కొందరికి కౌన్సెలింగ్ ఇచ్చామని చెప్పారు.

అధికారుల పర్యవేక్షణ లోపంతోనే చెరువు కబ్జా : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

మైనర్ ఇరిగేషన్ డిఇకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పట్టణానికి ఆనుకొని ఉన్న చెరువు కబ్జాలకు గురి కావడానికి అధికారుల పర్యవేక్షణ, నిర్లక్ష్య లోపమే కారణమని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, నాయకులు షాకీర్ తెలిపారు. గురువారం ఆలూరు చెరువులో కబ్జాల కోసం పాతిపెట్టిన బండ రాళ్లను తొలగించేందుకు వచ్చిన మైనర్ ఇరిగేషన్ డిఇ చెన్న కేశవ నాయక్, జెఇ ఫణికి సిపిఎం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆలూరు చెరువు మళ్లీ కబ్జాలకు గురికాకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా హనుమంతు, షాకీర్ మాట్లాడారు. 155.73 ఎకరాల ఆలూరు చెరువు కింద 300 ఎకరాలు పంట సాగు అయ్యేవని తెలిపారు. వర్షాలు లేక ఆలూరు చెరువు పూర్తిగా ఎండిపోవడంతో అధికార పార్టీ నాయకులు, కొంతమంది కబ్జాకోరులు కబ్జాలకు పాల్పడుతూ, అనుమతులు లేకుండా నల్లమట్టి, గరుసు మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారని, సంబంధిత అధికారులు తమ దృష్టికి వస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండేళ్ల క్రితం అధికార పార్టీ నాయకులు, ఇప్పుడు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో చెరువు కబ్జాకు పాల్పడుతున్నారని తెలిపారు. చుట్టపు చూపుగా వచ్చి రాళ్లు తొలగించి పోలీసులకు, రెవెన్యూ వారికి ఫిర్యాదు చేశామని చెప్పి వెళ్లడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకొని చెరువును కాపాడేందుకు శాశ్వత పరిష్కారం చూపాలని, పంటల సాగు, సమ్మర్ స్టోరేజ్‌గా నిర్మాణం చేపట్టాలన్నారు. కృష్ణ, మైనా పాల్గొన్నారు.

అన్యాక్రాంతం కాకుండా చూస్తాం

ఆలూరు చెరువు అన్యాక్రాంతం కాకుండా కాపాడతామని మైనర్ ఇరిగేషన్ డిఇ చెన్నకేశవ నాయక్ తెలిపారు. గత రెండు రోజుల క్రితం చెరువు కబ్జాకు పాల్పడినట్లు తెలియడంతో చెరువును పర్యవేక్షించి పాతిపెట్టిన బండ రాళ్లను తొలగించినట్లు చెప్పారు. ఎవరైతే కబ్జాకు పాల్పడ్డారో వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆలూరు తహశీల్దార్ గోవింద్ సింగ్, సిఐ వెంకట చలపతికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితం కబ్జాకు పాల్పడుతున్నారనే సమాచారంతో చెరువును సందర్శించి కాపాడినట్లు చెప్పారు. చెరువు సరిహద్దులకు కంచె వేసేందుకు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. మళ్లీ ప్రస్తుత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. చెరువు కబ్జాను పాల్పడినా, అనుమతులు లేకుండా మట్టిని తొలగించినా తమ దృష్టికి తెస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు బదిలీలు కావడంతో ఉన్న అధికారులతో ఇన్‌ఛార్జీలుగా నియమించుకొని పని చేయించుకుంటున్నామని చెప్పారు. ప్రభుత్వం అధికారులను నియమించగానే పూర్తిగా చెరువుల పర్యవేక్షణ చేపడుతామని తెలిపారు. మైనర్ ఇరిగేషన్ జెఇ ఫణి, ఆలూరు విఆర్ఒ మహేంద్ర, సర్వేయర్ నాయక్ ఉన్నారు.

పైరును కాల్చారు.. న్యాయం చేయండి

- బాధితుల ఆవేదన

ప్రజాశక్తి - ఆదోని

సాగు చేసిన వరి పంటను కాల్చేసి తమపై దాడి చేశారని, న్యాయం చేయాలని బాధితులు మాల ఈరన్న, కృష్ణయ్య వాపోయారు. గురువారం పట్టణంలోని రెవెన్యూ కాంప్లెక్స్‌లో బాధితులు విలేకరులతో మాట్లాడారు. కౌతాళం మండలం కుంభాలనూరు గ్రామంలోని సర్వే నెంబర్ 128లో తమకు మూడెకరాల పొలం ఉందని, పొలం పక్కన ఉన్న కురువ ముదే గౌడ్, కరపదిన్నె వీరేష్, మరికొందరు ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని వాపోయారు. ఎలాగైనా భూమిని కాజేయాలన్న ఉద్దేశంతో తమపై తరచూ దౌర్జన్యం చేస్తూ ఇటీవల దాడి కూడా చేశారని తెలిపారు. చేతికొచ్చిన రూ.60 వేల విలువ గల వరి పంటను తమ కళ్లెదుటే కాల్చేశారని వాపోయారు. ప్రశ్నించేందుకు ప్రయత్నిస్తే తమపై దాడికి పునుకున్నారన్నారు. ఈ ఘటన పట్ల కౌతాళం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళితే రెవెన్యూ అధికారులను సంప్రదించాలని ఉచిత సలహా ఇచ్చారని వాపోయారు. ఇంత జరిగినా కనీస వివరాలు కూడా తెలుసుకోలేదని పోలీసు అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షులు సాయిరాం మాట్లాడుతూ... మాల ఈరన్న, కృష్ణయ్య కుటుంబాలకు రక్షణ కల్పించాలని, ఘటనకు పాల్పడిన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే పోలీసు స్టేషన్ ముందు ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

డిజిటల్ అసిస్టెంట్లు లేక ప్రజల అవస్థలు

- పట్టించుకోని ఎంపిడిఒ

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో ఉన్న రెండు సచివాలయాల్లో కొంత కాలంగా డిజిటల్ అసిస్టెంట్లు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్తులు తెలిపారు. దీనిపై పలుమార్లు ఎంపిడిఒ జయరాముడు దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. గురువారం వారు మాట్లాడారు. గ్రామస్తులకు సచివాలయ సేవలు అందేలా కనీసం డిప్యూటేషన్ ద్వారా డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించే వెసలుబాటు ఎంపిడిఒకు ఉన్నా అటువంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. రెండు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ల కుర్చీలు ఖాళీగా ఉండడంతో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రజలు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి పెద్దకడబూరుకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. అలాగే రైతులు అండగల్ 1బి కోసం పెద్దకడబూరుకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తమకు ఇన్ని ఇబ్బందులు తలెత్తడానికి రెగ్యులర్ ఎంపిడిఒ లేకపోవడమే కారణమని తెలిపారు. ఇన్‌ఛార్జీ ఎంపిడిఒగా కొనసాగుతున్న జయరాముడుకు సచివాలయ వ్యవస్థపై అవగాహన లేకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి చిన్నతుంబళం గ్రామ సచివాలయాలకు డిజిటల్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు.

రాఘవేంద్రుని సన్నిధిలో భక్తుల సందడి

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో భక్తుల సందడి నెలకొంది. గురువారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం చేరుకున్న భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను, రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళ హారతులు స్వీకరించారు. స్వామి వారికి ప్రత్యేక సేవలు చేయించిన భక్తుల సమక్షంలో రాఘవేంద్రుని బృందావన ప్రతిమకు విశేష పూజలు నిర్వహించి, మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావన ప్రతిమను స్వర్ణ పల్లకిలో ఉంచి మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ప్రాకారంలో ఘనంగా పల్లకోత్సవం నిర్వహించారు. పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థులు భక్తులకు ఫల మంత్రాక్షతలు అందజేసి ఆశీర్వదించారు.

స్వర్ణమయమైన రాఘవేంద్రుని బృందావనం

మంత్రాలయంలో రాఘవేంద్రస్వామి మూల బృందావనం స్వర్ణమయమై భక్తులకు దర్శనం ఇచ్చారు. రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని పూజారులు నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణ కవచాలతో, పట్టు వస్త్రాలతో, వివిధ రకాల పూల మాలలు వేసి అందంగా అలంకరించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకొని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు.

బ్యాంకు అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలి : సిపిఎం

ప్రజాశక్తి- దేవనకొండ

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో కడపలోనే కొనసాగించాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ కోరారు. గురువారం స్థానిక ఎపిజిబి ముందు సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వీరశేఖర్, యూసుఫ్ బాష మాట్లాడారు. నేటి ఎపిజిబి గతంలో రాయలసీమ గ్రామీణ బ్యాంకుగా ఈ ప్రాంత ప్రజల జీవన విధానంతో మమేకమైందని తెలిపారు. ఈ ప్రాంత ప్రజల ఆర్థిక అవసరాలు, జీవన ప్రమాణాలు పెంచడంలో కీలకమైన పాత్ర పోషించిందని చెప్పారు. ఐదు జిల్లాల్లో విస్తరించిన బ్యాంకు ప్రజల జీవనంలో ఒకటిగా మారిందని తెలిపారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కడప నుంచి అమరావతికి తరలించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతిపాదనను ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ప్రధాన కార్యాలయం తరలిపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంకు, సప్తగిరి, చైతన్య గోదావరి బ్యాంకు ల విలీనం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న బ్యాంకులను ఏకీకరణ చేయడం భవిష్యత్తులో ప్రయివేటీకరణకు దారితీస్తుందని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ద్వారా ప్రజలకు అవసరమైన మేర సదుపాయాలు కల్పించడం లేదని పేర్కొన్నారు. ప్రభుత్వాల ప్రయివేటీకరణ దాహంతో ప్రభుత్వ రంగ సంస్థలు కుదేలవుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా గళం విప్పాలని కోరారు. ఎపిజిబి ప్రధాన కార్యాలయ తరలింపు, బ్యాంకుల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సిపిఎం చేసే ఉద్యమాలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నాగేష్, బలరాముడు, రాము, మహేష్, వీరాంజనేయులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని బంటనహాల్ గ్రామానికి చెందిన ఎంఆర్‌పిఎస్ఎస్ నాయకులు కాజీపురం రామాంజనేయులు గురువారం కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. సోమవారం బంటనహాల్ గ్రామంలో కాజీపురం రామాంజనేయులు ఇంటిపై అదే గ్రామానికి చెందిన తలారి సూరితో పాటు ఏడుగురు దాడి చేశారు. ఈ దాడిలో రామాంజనేయులుకు తీవ్ర గాయాలయినట్లు మృతుని బంధువులు తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న రామాంజనేయులును గుంతకల్ ప్రభుత్వాస్పత్రికి, అనంతరం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. గురువారం చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

CHANGE OF SURNAME

I, ABDULLA (Old Name) R/o.H.No:35-95-A, Kummari Street, Near One Town Police Station, kurnool dist, AP., have changed my name as SHAIK ABDULLA (New Name) S/o. NAJIR AHAMMAD

CHANGE OF SURNAME

I, ZAHIDA BEGUM (Old Name) R/o.H.No:35-95-A, Kummari Street, Near One Town Police Station, kurnool dist, AP., have changed my name as SHAIK ZAHIDA BEGUM (New Name) W/o. SHAIK ABDULLA